క్లుప్తంగా

పల్లె ప్రగతి పనుల పరిశీలన

చారకొండ: మండలంలోని మర్రిపల్లిలో బుధవారం సర్పంచ్ నరేష్ నాయక్ ఆధ్వర్యంలో పల్లె ప్రగతి పనులను ఎంపీడీఓ జయసుధ పరిశీలించారు. అదేవిధంగా నర్సరీని సందర్శించారు. అనంతరం గ్రామ పంచాయతీ నూతన భవనం నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. వారి వెంట ఎంపీఓ వెంకటేష్, తదితరులు ఉన్నారు.

ఎల్‌ఈడీ బల్బుల ఏర్పాటు

చారకొండ: మండలంలోని అగ్రహారం తండాల్లో బుధవారం సిర్సనగండ్ల ఎల్‌ఈడీ బల్బులను ఎంపీటీసీ లక్ష్మణ్ నాయక్ ప్రారంభించారు. ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నామని ఎంపీటీసీ పేర్కొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

చారకొండ: మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో అధికారి జయసుధ బుధవారం అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో నర్సరీల నిర్వహణ, మొక్కల నాటే కార్యక్రమం, ఉపాధి పనులు, నూతన జీపీ భవనాల నిర్మాణాలపై అధికారులు పూర్తి స్థాయిలో పురోగతి సాధించే విధంగా కృషి చేయాలని ఆయా గ్రామాల పంచాయతీ అధికారులు, ఉపాధి అధికారులను ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. సమావేశంలో ఎంపీఓ వెంకటేష్, ఏపీఓ లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి అధికారులు ఉన్నారు.

చెక్కుల పంపిణీ

ఉప్పునుంతల: మండలంలోని పెద్దాపూర్‌లో బుధవారం ప్రభుత్వం నుంచి మంజూరైన బీసీ బంధు చెక్కులను సర్పంచ్ కొత్త శిరీష, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్త రవీందర్‌రావు లబ్ధిదారులు కురుమయ్య, మాద్గుల బిక్షపతికి అందజేశారు. అదేవిధంగా గ్రామానికి చెందిన తోట్ల సాయిబాబు కుమారుడికి సీఎం సహాయ నిధి మంజూరైన రూ.52 వేల చెక్కును వారు అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు స్కైలాబ్, రేణయ్య, బురాన్, నాయకులు పర్వతాలు, యాదయ్య పాల్గొన్నారు.

భూమిపూజ

ఉప్పునుంతల: మండలంలోని ఉప్పరిపల్లిలో నూతన గ్రామ పంచాయతీ నిర్మాణానికి బుధవారం జెడ్పీటీసీ అనంతప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ ఇంద్రసేనారెడ్డి తదితరులు భూమి పూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ. 20 లక్షలు మంజూరైనట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటయ్య, వార్డు సభ్యులు మాధవరావు, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, విష్ణువర్ధన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, శ్రీనుగౌడ్, శేఖర్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

ఉప్పునుంతల: మండలంలోని సీబీ తండాలో మంగళవారం రాత్రి వినాయకుడి నిమజ్జనోత్సవం విద్యుదాఘాతంతో మృతి చెందిన సబావట్ లక్ష్మీపతి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ వేర్వేరుగా పరామర్శించారు. బుధవారం అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రి వద్ద బాధితులను ఓదార్చారు. మృతుని కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని వారు హామీ ఇచ్చారు.

మద్యం దుకాణం సీజ్

పెద్దకొత్తపల్లి: మండలంలోని కల్వకోల్‌లో సింధు మద్యం దుకాణంలో కల్తీ మద్యం విక్రయిస్తుండగా నాగర్‌కర్నూల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కొల్లాపూర్ ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి పట్టుకున్నట్లు కొల్లాపూర్ ఎక్సైజ్ సీఐ ఏడుకొండలు తెలిపారు. మంగళవారం రాత్రి అందుకున్న సమాచారం మేరకు మద్యం దుకాణంలో పనిచేస్తున్న రాజేష్, యాదగిరి ఇండ్లలో దాడులు నిర్వహించి నకిలీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కొంత కాలంగా మద్యంబాటిళ్లపై సీల్ తొలగించి కల్తీ చేసి కొత్త సీల్ వేసి విక్రయిస్తున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. అనంతరం సింధు మద్యం దుకాణాన్ని సీజ్ చేశారు. యాదగిరి, రాజేష్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

శిలాఫలకం ధ్వంసం

వెల్దండ: మండలంలోని బైరాపూర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం అర్ధరాత్రి బ్రిడ్జి నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకం ధ్వంసం చేశారు. సర్పంచ్ దార్ల కుమార్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాస్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బైరాపూర్‌లో వర్షాలకు బ్రిడ్జి కొట్టుకుపోవడంతో ప్రభుత్వం నూతన బ్రిడ్జి నిర్మాణానికి రూ.3.50కోట్లు మంజూరు చేసింది. ఈ నెల 21న కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ శంకుస్థాపన చేసి శిలాఫలకంను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రమేష్‌గౌడ్, జైపాల్‌నాయక్, గోపాల్‌నాయక్, నిరంజన్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల నుంచి వివిధ పార్టీలకు చెందిన నాయకులు హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో బుధవారం కాంగ్రెస్‌లో చేరారు.

బీఆర్ఎస్‌లోకి..

తెలకపల్లి: మండల కేంద్రానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

అధ్యక్షుడిగా అశోక్

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని వాసవీకన్యకాపరమేశ్వరి దేవాలయంలో బుధవారం దసరా నవరాత్రి ఉత్సవ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాచిశెట్టి అశోక్ ఎన్నికయ్యారు.

వినాయకా.. సెలవిక

- నిమజ్జనానికి తరలిన గణనాథులు
- ఆకట్టుకున్న శోభాయాత్ర



కల్వకుర్తిలో



నాగర్‌కర్నూల్‌లో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు

కందనూలు: జిల్లా కేంద్రంలో మంగళవారం రాత్రి ప్రారంభమైన వినాయకుడి శోభయాత్ర బుధవారం మధ్యాహ్నం వరకు కొనసాగింది. నాగర్‌కర్నూల్ చెరువు వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక క్రేన్ సాయంతో వినాయకులను చెరువుల్లో నిమజ్జనం చేశారు.

రూ.5.10లక్షలు పలికిన వినాయకుడి లడ్డూ

జిల్లా కేంద్రంలోని రామ్‌నగర్ కాలనీ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూను వేలం పాటలో రూ.5.10లక్షలకు పట్టణానికి చెందిన శరత్ అండ్ ఫ్రెండ్స్ దక్కించుకున్నారు.

కల్వకుర్తి టౌన్: నవరాత్రులు పూజలందుకున్న గణనాథులను బుధవారం నిమజ్జనానికి తరలించారు. మొదట హనుమాన్ దేవాలయంలో ఉన్న గణనాథుడి శోభాయాత్ర ప్రారంభమైంది. దారి పొడవునా వాహనాల్లో వినాయక ప్రతిమలు చూడ ముచ్చటగా కన్పించాయి. వాహనాల ముందు యువకులు నృత్యాలు చేస్తూ అలరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. మున్సిపల్ పరిధిలోని హైదరాబాద్ రోడ్డులో ఉన్న ఎర్రకుంటలో గణనాథులను నిమజ్జనం చేశారు. పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు. కల్వకుర్తి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో వినాయక లడ్డూ రూ.27వేలకు దక్కించుకున్నారు.

చారకొండ: మండల కేంద్రంలో వినాయక నిమజ్జనోత్సవంతో భాగంగా యువకులు నృత్యాలు చేస్తూ ఆకట్టుకున్నారు.

కొల్లాపూర్: పట్టణంలోని గణేష్ విగ్రహాలను ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు.

తిలక్‌నగర్ లడ్డూ రూ.76వేలు

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని తిలక్‌నగర్ వినాయక లడ్డూను పాండు రంగారెడ్డి రూ.76,116వేలకు దక్కించుకున్నారు. విద్యానగర్ కాలనీలో రూ.65 వేలకు నరేష్‌చారి లడ్డూను కైవసం చేసుకున్నారు.



కల్వకుర్తి మండలం విద్యానగర్ కాలనీలో

ఘనంగా కొండా లక్ష్మణ్ జయంతి



అచ్చంపేటలో నివాళులర్పిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు



కొల్లాపూర్‌లో..

అచ్చంపేట రూరల్: పట్టణంలోని పద్మశాలి కమ్యూనిటీ హాల్‌లో బుధవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పద్మశాలి యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కోట కిషోర్, శ్రీనివాసులు, నిర్మల, శకుంతల, యాదగిరి, సత్యనారాయణ, రమేష్, మల్లికార్జున్ ఉన్నారు.

కొల్లాపూర్: పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో బీఎస్పీ నాయకులు కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి జిల్లా అధ్యక్షుడు కారంగి బ్రహ్మయ్య పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

పెద్దకొత్తపల్లి: ఎంపీడీఓ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ చిత్రపటానికి ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, ఎంపీడీఓ కృష్ణయ్యలు నివాళులర్పించారు.

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 108వ జయంతిని నిర్వహించారు. చైర్మన్ సత్యం, కౌన్సిలర్లు శ్రీశైలం, భోజిరెడ్డి, ఉన్నారు.

దోమలపెంట: మండల కేంద్రంలోని భ్రమ మార్కండేయ ఆలయంలో కమిటీ సభ్యులు కొండా లక్ష్మణ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు.

కల్వకుర్తిరూరల్: పట్టణంలో బీసీసబ్‌ప్లాన్ సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కొండా లక్ష్మణ్ జయంతికి మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, తదితరులు హాజరయ్యారు.

కాంగ్రెస్ డిక్లరేషన్‌లను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

లింగాల: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ డిక్లరేషన్లను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు ఇందిరమ్మ, సర్పంచ్ కొత్త ప్రసన్న కోరారు. మండలంలోని జీల్గుపల్లిలో బుధవారం మహిళా కమిటీని ఏర్పాటు చేశారు. డిక్లరేషన్‌కు సంబంధించిన కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సోనియాగాంధీ ఇచ్చిన హామీలను అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం




కల్వకుర్తిలో పాలాభిషేకం చేస్తున్న ఆర్పీలు

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న మహిళా సంఘాల రీసోర్స్ పర్సన్‌లకు వేతనాలు పెంచడంతో బుధవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మెప్మా ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేం నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీశైలం, భోజిరెడ్డి, శ్రీను, సైదులు, పీఏసీఎస్ చైర్మన్ జనార్దన్ రెడ్డి, ఆర్పీలు పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట సీఎం కేసీఆర్ చిత్రపటానికి మెప్మా రిసోర్స్‌పర్సన్‌లు పాలాభిషేకం చేశారు. గౌరవ వేతనం రూ. 4వేల నుంచి రూ.6వేల వరకు పెంచడం హర్షించదగ్గ విషయమన్నారు.

సత్తాచాటిన ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థులు



అచ్చంపేట రూరల్: పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల గ్రౌండ్‌లో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు సత్తాచాటారు. అండర్-14 విభాగంలో బాలికలు, బాలురు మొదటి బహుమతి, అండర్-17 విభాగంలో బాలికలు ద్వితీయ బహుమతి సాధించారని హెచ్‌ఎం శేఖర్ తెలిపారు. స్కూల్ నుంచి 13 మంది విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు.

పశువుల సంత వేలం రూ.10.50లక్షలు



అచ్చంపేట రూరల్: మున్సిపాలిటీకి పశువులు, గొర్రెలు, మేకల సంత అధనపు ఆదాయం తెస్తుంది. గతంలో మున్సిపాలిటీ నుంచి సంతను నిర్వహించగా మార్చి 29న మొదటి సారి 12నెలలకు నిర్వహించిన సంత వేలం పాట రూ. 48లక్షల 25వేలు అత్యధిక ధర పలికింది. అనివార్య కారణాల వల్ల టెండర్‌ను రద్దు చేశారు. ఈనెల 20న మరోసారి 6నెలలకు వేలం పాట నిర్వహించగా ఇద్దరు మాత్రమే పాల్గొని రూ. 10లక్షల 25వేల వరకు పాడారు. అనుకున్న స్థాయిలో వేలం పాటలో డబ్బులు రాలేదని రద్దు చేశారు. తిరిగి బుధవారం మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, కమిషనర్ శ్రీహరిరాజు, మేనేజర్ అనిత, కౌన్సిలర్ల సమక్షంలో వేలం పాట నిర్వహించగా 6 మంది పాల్గొన్నారు. అందులో నలుగురు రింగు కావడం, రూ.10.50లక్షలకు పదరకు చెందిన శ్రీనివాసులు టెండర్ దక్కించుకున్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

లింగాల: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి–ఇందూ జ్ఞాన వేదిక నాగర్‌కర్నూల్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని మగ్గుంపూర్‌లో భగవద్గీత ప్రాముఖ్యత గురించి ప్రచారం నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు మనోహర్, సభ్యులు పర్వతాలు, వెంకటన్న, నిరంజన్, చంద్రకళ, స్వప్న, హంసిని పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

బల్మూర్: మండల కేంద్రానికి చెందిన సుధాపాక రేణమ్మ మంగళవారం రాత్రి ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బుధవారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

ఉచిత వైద్య శిబిరం



జిల్లాలోని బల్మూర్, అమ్రాబాద్‌లోని పదర మండలంలోని కృష్ణానది సమీపంలో గీస్‌గండి చెంచుపెంటలో, అదేవిధంగా వెంకటేశ్వర బావి, మన్ననూర్‌లో వైద్య శిబిరాలు నిర్వహించారు. బల్మూరులోని కొండనాగులలో 450, వెంకటేశ్వరబావిలో 110, చెంచుపెంటలో 40 మందికి వైద్య పరీక్షలు చేశారు. –సాక్షి, నెట్‌వర్క్

అడ్డా కూలీలను ఢీకొన్న కారు: ముగ్గురికి గాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం: అడ్డా కూలీలను కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు, ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రానికి చెందిన రాజు, కేశవులు, వెంకటయ్యలు సంత బజారు ప్రధాన రహదారిపై కూలీ కోసం వేచి ఉన్నారు. జనరల్ ఆస్పత్రి వైపు నుంచి అచ్చంపేటకు చెందిన మైనర్ బాలుడు కారులో వేగంగా వచ్చి అడ్డా కూలీలను ఢీకొనడంతో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు బాధితులను జనరల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కారుతోపాటు , మైనర్ బాలుడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు.

పల్లె ప్రగతిలో అందరూ భాగస్వాములవుదాం



పెంట్లవెల్లి: పల్లె ప్రగతిలో అందరూ భాగస్వాములవుదామని ఎంపీపీ ఉమామహేశ్వరి అన్నారు. బుధవారం మండలకేంద్ర ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. పలు శాఖల వారీగా సమస్యలపై చర్చించారు. గ్రామాల్లో నెలకొన్న పారిశుద్ధ్యం, తాగునీరు, వీధిలైట్లు, విద్యుత్ సమస్యలను గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. కార్యక్రమంలో ఏఈలు నాగరాజు, సాయిరాం, ఎంపీడీఓ రామయ్య, విజయ రామారావు, వైస్ ఎంపీపీ భీంరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యానవనాలపై వందశాతం సబ్సిడీ

తాడూరు: ఉద్యానవనాల పెంపకంపై పండ్ల తోటలు, వివిధ తోటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ గంగామోహన్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఉపాధిహామీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో సన్నచిన్నకారు రైతులకు ఉపాధిహామి పథకం ద్వారా 100 సబ్సిడీపై పండ్ల తోటల పెంపకానికి నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. ఎంపీఓ లక్ష్మణ్‌నాయక్, ఏపీఓ ప్రవీన్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన అవసరం



కల్వకుర్తి టౌన్: ఈవీఎం, వీవీప్యాట్‌ల వినియోగంపై ఓటర్లకు అవగాహన అవసరమని మున్సిపల్ చైర్మన్ సత్యం అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వీవీప్యాట్ వినియోగంలోకి వచ్చిన తర్వాత ఓటుపై పారదర్శకత పెరిగిందన్నారు. మున్సిపల్ కౌన్సిలర్లు ఒక్కొక్కరుగా ఓటు వేసే విధానాన్ని పరిశీలించారు. కార్యాలయంలో ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. కౌన్సిలర్లు శ్రీశైలం, శ్రీను, భోజిరెడ్డి, సైదులు, పీఏసీఎస్ చైర్మన్ జనార్దన్ రెడ్డి, కమిషనర్ ఆశ్రిత్ కుమార్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

చెంచులకు ..

బల్మూర్: మండలంలోని గుడిబండ, చెంచుగూడెం గ్రామాల్లో బుధవారం ఆర్డీఓ గోపిరాం ఆధ్వర్యంలో చెంచులకు ఈవీఎంలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సలీమోద్దిన్, ఆర్ఐ శివ, సర్పంచ్ అంజనమ్మ పాల్గొన్నారు.

ఆడబిడ్డలకు పెద్దపీట



బిజినేపల్లి: సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో ఆడబిడ్డలకు పెద్దపీట వేస్తున్నట్లు ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. పదేళ్ల ప్రజాప్రస్థానంలో మర్రన్న కార్యక్రమంలో భాగంగా 14వ రోజు పాదయాత్రను తిమ్మాజీపేట మండలంలోని బుధవారం ఉదయం ఆవంచ గ్రామం నుంచి ప్రారంభించారు. అనంతరం మండలంలోని ఆర్‌సీ తండా, హనుమాన్‌తండా, ఇప్పలపల్లి, మాన్యానాయక్ తండా, హెమ్లానాయక్‌తండా, మరికల్ గ్రామాల్లో పాదయాత్రను చేపట్టి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. మరోసారి గెలిపిస్తే ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

ఘనంగా గంధోత్సవం

కొల్లాపూర్: మిలాద్–ఉన్–నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం పట్టణంలో ముస్లింలు గంధోత్సవం నిర్వహించారు. జామె మజీద్ నుంచి ప్రధాన వీధుల గుండా గంధోత్సవ ఊరేగింపు సాగింది.

రాష్ట్రంలో దుర్మార్గమైన పాలన

కల్వకుర్తిరూరల్: రాష్ట్రంలో దుర్మార్గమైన పాలన కొనసాగుతున్నదని బీజేపీ చేరికల కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం పట్టణంలో అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళనకు ఆయన సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, గ్రామ పంచాయతీ కార్మికులు, వంట కార్మికులు ఆందోళనలు చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఏ మాత్రం పట్టడం లేదన్నారు. రాష్ట్ర నాయకుడు ఆచారి, దుర్గాప్రసాద్, శేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఈటలకు ఘన స్వాగతం

తాడూరు: మండల కేంద్రంలో ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ఉ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కొండ మణెమ్మ, నియోజకవర్గ నేత నాగేష్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల నాయకులు స్వాగతం పలికారు.

శుద్ధమైన నీటినే తాగాలి



కందనూలు: శుద్ధమైన నీటినే తాగాలని సామాజిక వేత్త, 'నేను సైతం సమాజం కోసం' సంస్థ వ్యవస్థాపకులు షఫీ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో మహమ్మద్ ఫక్రుద్దీన్ సారథ్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంగన్ నీటి శుద్ధి యంత్రం ద్వారా లభించే ఆరోగ్యకరమైన నీటి గురించి వివరిస్తూ ఏ నీటిలో తాగాలో అవగాహన కల్పించారు. మనిషికి వచ్చే జబ్బులు 70 శాతం మనం తాగే కలుషిత నీటి వల్లే వస్తాయన్నారు. ఏనాజిక్ గ్లోబల్ లీడర్ ప్రకాష్ శాస్త్రి, మున్సిపల్ చైర్ పర్సన్ కల్పన, కౌన్సిలర్ సుమలత, రాధాకృష్ణ, సుధాకర్ రెడ్డి, సీపీఐ రాష్ట్ర నాయకులు ఆనంద్, జిల్లా కార్యదర్శి బాల్ నర్సింహ, కరణ్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఓ కాలనీకి చెందిన మహిళ అదృశ్యమైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ వివరాల ప్రకారం పట్టణానికి చెందిన మహిళ మంగళవారం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఎంతకీ తిరిగిరాకపోవడంతో బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. బుధవారం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రాజు తెలిపారు.

భూసార పరీక్షలపై అవగాహన



తాడూరు: మండల కేంద్రంలో బుధవారం కేవీకే పాలెం రావేఫ్ విద్యార్థినులు భూసార పరీక్షలపై బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీ ఆవరణలో మట్టి నమూనాలను సేకరించే విధానం, సేకరించిన మట్టిని పరీక్ష కేంద్రాలకు ఏ విధంగా పంపించాలి, భూసార పరీక్షలో వచ్చిన ఫలితాలను బట్టి రైతులు ఏ పంటలు సాగు చేయాలో వివరించారు.

కుట్టుమిషన్లు పంపిణీ



కొల్లాపూర్: మండల కేంద్రంతో పాటు కోడేరు, పెంట్లవెల్లి మండలాలకు చెందిన ముస్లిం మహిళలకు బుధవారం ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. మైనార్టీ సంక్షేమ శాఖ మంజూరు చేసిన మిషన్లను 67 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలని సూచించారు. అంతకు ముందు ఎమ్మెల్యేను ఆయన నివాసం వద్ద మున్సిపాలిటీలో మెప్మాలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు శాలువాలు, పూలమాలతో సత్కరించారు. అదేవిధంగా సీఎం ఆర్ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దూరెడ్డి రఘువర్ధన్‌రెడ్డి, కొండా సుధాకర్‌రెడ్డి, రుక్కుద్దీన్, గఫూర్, ఫయాజ్ తదితరులున్నారు.

ముగిసిన పవిత్రోత్సవాలు



బిజినేపల్లి: వట్టెం వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం స్వామి వారి మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మహాపూర్ణాహుతి, పవిత్ర మాలాధారణ చేశారు.

ఆర్డీఓకు వినతి

కల్వకుర్తి: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం పట్టణంలో ఆర్డీఓ శ్రీనివాస్‌కు మధ్యాహ్న భోజన పథకం కార్మికులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బాలస్వామి, శాంతమ్మ, అనురాధ, యాదమ్మ పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

నాగర్‌కర్నూల్‌రూరల్: మహిళలపై, మైనర్ బాలికలపై దాడులు నిరసిస్తూ అక్టోబర్ 5న ఢిల్లీలో నిర్వహించే మహిళా ర్యాలీని విజయవంతం చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కందికొండ గీత కోరారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈశ్వరమ్మ, చెన్నమ్మ, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి


నాగర్‌కర్నూల్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం రైతు సంఘాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ సాగర్, పస్య పద్మలు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో సంయుక్త మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. శ్రీనివాసులు, దేశ్యానాయక్, బాలపీర్, బాలమురళి, కృష్ణాజి, వార్ల వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన

కొల్లాపూర్: పట్టణంలోని ఈదమ్మ గుడి సమీపంలో మున్సిపల్ నర్సరీని స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం గ్రీన్‌ల్యాండ్ స్కూల్ విద్యార్థులు సందర్శించారు. పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మున్సిపల్ ఉద్యోగులు, ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది ఉన్నారు.

బిజినేపల్లి: విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలని పాలెం కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డా.జ్యోత్స్న అన్నారు. బుధవారం మండలంలోని పాలెం ప్రాథమిక పాఠశాలలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం రేణుక, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్లు విడుదల



కందనూలు: హైదరాబాద్‌లో ఆరసం రాష్ట్ర మూడో మహాసభలను అక్టోబర్ 1, 2 వ తేదీల్లో నిర్వహిస్తునట్లు జిల్లా అధ్యక్షుడు కల్వకోలు మద్దిలేటి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు కూడలిలో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.